



వైసీపీ అల్లరిమూకల దాడిలో గాయపడ్డ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత



కర్నూలులో పాత్రికేయ, రాజకీయ, ప్రజా సంఘాల నిరసన

- నంద్యాల - చిత్తూరు జాతీయ రహదారి దిగ్బంధం
- స్థానిక శ్రీనివాస సెంటర్‌లో నిరసన
- వైసీపీ మూకలను కఠినంగా శిక్షించాలని డిమాండ్
- కలెక్టర్, ఎస్పీకి వినతి పత్రం అందజేత

నిరసనల హోరు





జర్నలిస్టుల ఆందోళనలు హోరెత్తాయి. వైసీపీ రౌడీ మూకల దాడిని జర్నలిస్టులు ముక్తకంఠంతో ఖండించారు. అనంతపురం జిల్లా రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై జరిగిన దాడిని నిరసిస్తూ సోమవారం జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు జరిగాయి. నంద్యాల జిల్లా కేంద్రం సహా పాణ్యం, బనగానపల్లె, ఆళ్లగడ్డ, డోన్, నందికొట్కూరు, ఆత్మకూరు పట్టణాలతో పాటు మండల కేంద్రాల్లో వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహించారు. జర్నలిస్టుల నిరసనలకు పలు పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ శ్రీకృష్ణపై దాడికి పాల్పడ్డ రౌడీ మూకలపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని అన్నారు. సీఎం జగన్ బేషరతుగా జర్నలిస్టులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పాత్రికేయులు తల్చుకుంటే ప్రభుత్వాలనే మార్చేయగలరని హెచ్చరించారు. అనంతరం అధికారులకు వినతి పత్రాలు అందజేశారు.

నంద్యాల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి)/నంద్యాల (కల్చరల్): అనంతపురం జిల్లా రాప్తాడులో ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ మూకలు చేసిన దాడికి వ్యతిరేకంగా జర్నలిస్టు, ప్రజా, విద్యార్థి సంఘాలు సోమవారం నంద్యాల పట్టణంలో నిరసనలు తెలియజేశాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయా సంఘాలు చేపట్టిన నిరసనతో పట్టణం స్తంభించిపోయింది. ఉదయం జర్నలిస్టు సంఘం ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ వద్ద నంద్యాల - చిత్తూరు రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు నాగరాజు మాట్లాడుతూ రౌడీ మూకలు ఫొటోగ్రాఫర్‌పై దాడి చేయడం అమానుషమని అన్నారు. ఇది ప్రజాస్వామ్యంపై దాడి చేసినట్లు ఉందని పేర్కొన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జర్నలిస్టులపై దాడులు ఎక్కువయ్యాయని, తమకు వ్యతిరేకంగా మాట్లాడితే సహించలేని స్థాయికి వైసీపీ నాయకులు వచ్చారని, సీఎం జగన్ ఓవైపు సభలో మాట్లాడుతుండగానే వైసీపీ అల్లరి మూకలు చంపేందుకు ప్రయత్నించడం చూస్తుంటే పత్రిక అసహనం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చని, ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యానికి చేటని, ప్రజా గళాన్ని వినిపించే జర్నలిస్టులపై, ఫొటోగ్రాఫర్లపై దాడులు చేయడం సరికాదని, ఈ ఘటనకు పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ డా.కె.శ్రీనివాసులును కలిసి వినతిపత్రం అందజేసి ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని కోరారు. డిమాండ్ చేశారు. ఇక సాయంత్రం 5 గంటలకు ఏపీయూడబ్ల్యూజేతో కలిసి టీడీపీ, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు రాజ్ థియేటర్ సర్కిల్ నుంచి ర్యాలీగా వెళ్లి శ్రీనివాస సెంటర్‌లో రాస్తా రోకో చేసి నిరసన కార్యక్రమం చేపట్టాయి. ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఖండే శ్యామ్ సుందర్‌లాల్, జిల్లా అధ్యక్షులు మధుబాబు, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు చలం బాబు, కార్యదర్శి ఉస్మాన్ బాషా మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడులు చేస్తే ఆరు నెలలు జైలు శిక్ష ఉంటుందని గతంలో హైకోర్టు చెప్పిందని, అయినా వైసీపీ మూకలు రెచ్చిపోయి దాడులకు దిగుతున్నారంటే తమ వెనుక వారి నాయకుడి అండ ఉందన్న ధీమాతోనే అని అన్నారు. దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి వెంటనే చర్యలు తీసుకోవాలని, లేకపోతే రాబోయే రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. టీడీపీ జిల్లా కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ మాట్లాడుతూ వైసీపీ పాలన మొదలైన ఈ ఐదేళ్లలో జర్నలిస్టులపై అనేక దాడులు జరిగాయని అన్నారు. సీఎం జగన్ ఏ ఒక్క రోజు కూడా ఈ దాడులను ఖండించడం గానీ, ఆపేందుకు గానీ ప్రయత్నం చేయలేదని పేర్కొన్నారు. తమకు వ్యతిరేకంగా వార్తలు రాస్తే దాడులు చేస్తామంటే, వైసీపీ అనుకూల పత్రికలో పని చేసే వారిపై చాలా దాడులు జరగాలని, కానీ వారిపై టీడీపీ, ఇతర పార్టీలు చాలా సంయమనంతో వ్యవహరిస్తున్నాయని స్పష్టం చేశారు. ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై జరిపిన దాడిని టీడీపీ పూర్తిగా ఖండిస్తోందన్నారు. అనంతరం ఎస్పీ రఘువీర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగరాజు, సీపీఐ నాయకుడు బాబా ఫక్రుద్దీన్, పీడీఎస్‌యూ నాయకులు రఫీ, జర్నలిస్టు సంఘం నాయకులు శివ, మాదాల శ్రీనివాసులు, జగన్‌మోహన్, మౌలాలి, జాషువా,సుబ్బరాయుడు, మస్తాన్, ఇక్బాలుబాషా, నాగరాజు, ఆంధ్రజ్యోతి నంద్యాల జిల్లా ఇన్‌చార్జి మురళీమోహన్ రెడ్డి, రిపోర్టర్లు గిరిబాబు, అబ్రహాం, ప్రజా సంఘాల నాయకులు ప్రసాద్, శ్రీనివాసులు, సోమన్న, ధనుంజయుడు, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న జర్నలిస్టులు



ఎస్పీకి వినతి పత్రం ఇస్తున్న జర్నలిస్టులు



డోన్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న జర్నలిస్టులు, ప్రజా సంఘాల నాయకులు



బనగానపల్లెలో నల్లబ్యాడ్జీలతో నిరసన



ఆత్మకూరులో ఆందోళన చేస్తున్న జర్నలిస్టులు



నందికొట్కూరులో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో..



పాణ్యంలో రాస్తారోకో నిర్వహిస్తున్న జర్నలిస్టులు



ఆళ్లగడ్డలో డీటీకి వినతి పత్రం ఇస్తున్న జర్నలిస్టులు



నంద్యాల పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న రాజకీయ, ప్రజా సంఘాలు



నంద్యాల- చిత్తూరు రహదారిపై ఆందోళన

'సవాళ్లను పరిష్కరించడంలో లోకాయుక్త కీలకం'



2023 వార్షిక నివేదికను గవర్నర్‌కు సమర్పించిన రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి

కర్నూలు(లీగల్), ఫిబ్రవరి 19: రాష్ట్రంలో ఎదురవుతున్న సవాళ్లను పరిష్కరించడంలో లోకాయుక్త కీలక పాత్ర వహిస్తోందని రాష్ట్ర లోకాయుక్త తన 2023 వార్షిక నివేదికలో పేర్కొంది. ఈ మేరకు ఆదివారం విజయవాడలోని రాజ్‌భవన్‌లో జరిగిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి, రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్‌కు 2023 వార్షిక నివేదికను అందజేసింది. ప్రజల ఫిర్యాదులను పరిష్కరించడంతోపాటు అనధికార ఇసుక రీచులు, వాటి ఆక్రమణలు, అక్రమ ఇసుక మైనింగ్ వంటి పలు సమస్యలను రాష్ట్ర లోకాయుక్త పరిష్కరించింది. కర్నూలు జిల్లాకు సంబంధించి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో అనైతిక పద్ధతులను పరిష్కరించిందని, విద్యుత్ ప్రమాద బాధితులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించేందుకు రాష్ట్ర లోకాయుక్త విశేషంగా కృషి చేసిందని తమ నివేదికలో తెలియజేసింది. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది ముఖ్యంగా కర్నూలు జిల్లాకు సంబంధించి ఎక్కువ కేసుల దాఖలుతో రాష్ట్ర వ్యాప్తంగా కేసుల సంఖ్య గణనీయంగా పెరిగింది. దీనికి ప్రధాన కారణం ప్రజలలో చైతన్యం పెరగడమేనని, కేసుల పరిష్కారంలో సహకరించిన లోకాయుక్త సిబ్బందికి ప్రభుత్వ శాఖల అధికారులను రాష్ట్ర లోకాయుక్త అభినందించింది. నివేదికను సమర్పించే సమయంలో రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డితోపాటు లోకాయుక్త రిజిస్ట్రార్ టి.వెంకటేశ్వరరెడ్డి, డిప్యూటీ రిజిస్ట్రార్ సీహెచ్ పోలయ్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రేపు శ్రీశైలంలో మహా కుంభాభిషేకం

కంచి, పుష్పగిరి, జగద్గురు పీఠాధిపతుల రాక

శ్రీశైలం, ఫిబ్రవరి 19: శ్రీశైలం క్షేత్రంలో మహా కుంభాభిషేకం వేడుకలను దేవస్థానం వైభవంగా నిర్వహిస్తోంది. రాష్ట్ర కల్యాణం, ప్రజా సంక్షేమం కోసం చేపట్టిన మహా కుంభాభిషేకం మహోత్సవ క్రతువులు నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఉదయం శాస్త్రబద్ధంగా పూజల క్రతువులు నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేక పూజలు చేశారు. మహా కుంభాభిషేకాన్ని పురస్కరించుకుని స్వామి, అమ్మవార్లకు ప్రతి రోజూ విశేష పూజలు, దేవతాహవములు, దేవహవనములు, జపాలు, పారాయణలు నిర్వహిస్తున్నారు. చివరి రోజు 21వ తేదీన జరిగే మహాకుంభాభిషేకం మహోత్సవంలో కంచి పీఠాధిపతి శంకర విజేంద్ర సరస్వతి స్వామి, శ్రీశైల జగద్గురు పీఠాధిపతి చెన్న సిద్ధ రామ పండితారాధ్య శివాచార్య మహా స్వామీజి, పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతితోపాటు పలువురు ప్రముఖులు పాల్గొననున్నారు.



గోపురాలకు ఏర్పాటు చేసిన పరంజాలు

ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి అమానుష చర్య

● ఘటనపై స్పందించిన నాయకులు ● జగన్ ప్రభుత్వం తీరును ఎండగట్టిన వైనం



కర్నూలు (కల్చరల్), ఫిబ్రవరి 19: అనంతపురం జిల్లా రాప్తాడులో ఆదివారం జరిగిన సీఎం సిద్ధం సభలో స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీకి చెందిన రౌడీ మూకలు మూకుమ్మడిగా దాడి చేయడం అమానుషమని పలువురు నేతలు అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి తనకు వ్యతిరేకంగా వార్తలు రాసినా, ధర్నాలు చేసినా, నోరు విప్పి మాట్లాడినా అణచివేసే ధోరణితో ముందుకు పోతున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి, పాలకుల దృష్టికి తీసుకుపోయి వాటి పరిష్కారానికి వారధుల్లా కృషి చేస్తున్న జర్నలిస్టులను ఇలా దాడులు, దౌర్జన్యాలతో భయభ్రాంతులకు గురిచేయడం హేయనీయమని ముక్త కంఠంతో ఖండించారు.

ఇది ప్రజాస్వామ్యంపై దాడి



ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై జరిగిన దాడిని ప్రజాస్వామంపై జరిగిన దాడిగా భావించాలి. దీన్ని టీడీపీ తీవ్రంగా ఖండిస్తోంది. ప్రజాస్వామ్యానికి నాలుగు మూలస్తంభాల్లో ఒకటైన పత్రికల, మీడియా పాత్ర ఎంతో గొప్పది. ప్రజలకు, ప్రభుత్వానికి వారధుల్లాంటి జర్నలిస్టులపై దాడులు సరి కాదు.

- బీటీ నాయుడు, ఎమ్మెల్సీ

ప్రజాస్వామ్యంలో ఉన్నామా... రాక్షస పాలనలో ఉన్నామా..?



ఆంధ్రజ్యోతి అనంతపురం స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ రౌడీ మూకలు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇది దుర్మార్గమైన చర్య. సీఎం సిద్ధం సభలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం, అక్కడ ఉన్న రౌడీ మూకలు ఫొటోగ్రాఫర్‌ను నీది ఏ పత్రిక అని అడిగి మరీ దాడి చేయడం దారుణం. ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణను మూకుమ్మడిగా అరకిలో మీటరు దూరం వరకు తన్నుతూ, కొడుతూ ఈడ్చుకెళ్లడం చూస్తే మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా, రాక్షస పాలనలో ఉన్నామా అనే అనుమానం కలుగుతోంది.

- గౌరు చరిత, మాజీ ఎమ్మెల్యే, పాణ్యం టీడీపీ ఇన్‌చార్జి

దాడి దుర్మార్గం : బీవీ జయనాగేశ్వర్ రెడ్డి



ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు దాడిచేయడం దారుణం. సిద్ధం సభ కవరేజ్ కోసం వెళ్లిన ఫొటోగ్రాఫర్ సభలో కవరేజ్‌కోసం వెళ్లిన ఫొటో గ్రాఫర్‌ను వైసీపీ గూండాలు, అల్లరి మూకలు చుట్టు ముట్టి దాడిచేయటం వైసీపీ అరాచక పాలనకు నిదర్శనం. సీఎం జగన్ పాలన చేతగాక అసహనానికిలోనై ఎక్కడ ఓడిపోతాననే భయంతోనే మీడియాపై ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారు. సీఎం జగన్ చేస్తున్న అరాచకాలను రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారు. శ్రీకృష్ణపై దాడికి పాల్పడిన వైసీపీ అల్లరి మూకలను కఠినంగా శిక్షించాలి.

రాక్షస పాలనకు నిదర్శనం : తిక్కారెడ్డి



అభివృద్ధి చేతకాని సీఎం జగన్ రెడ్డి దాడులకు పాల్పడుతూ రాక్షస పాలనను తలపిస్తున్నాడు. ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు దాడి చేయడం హేయం. ప్రశ్నించిన వారిపై దాడులు చేయడం, కేసులు పెట్టడం కక్ష సాధింపు చర్యలకు పూనుకోవడం జగన్ రెడ్డికి ఆయన తాత రాజారెడ్డి నేర్పిన విద్య. రాయలసీమను ఏనాడూ పట్టించుకోని జగన్ 99 శాతం హామీలు పూర్తి చేశానని చెప్పుకోవడం సిగ్గు చేటు. వచ్చే ఎన్నికల్లో జగన్‌ను ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు.

జర్నలిస్టులపై దాడులు సిగ్గు చేటు



అనంతపురం జిల్లాలోని రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టులపై దాడి సిగ్గు చేటు. సిద్ధం సభకు జనాన్ని తరలించేందుకు వైసీపీ చేయని ప్రయత్నమే లేదు. ప్రైవేట్ స్కూళ్ల తరగతులను రద్దు చేసి మరీ స్కూల్ బస్సులను బలవంతంగా లాక్కున్నారు. ఆర్టీసీ బస్సులను కూడా సిద్ధం సభకు మళ్లించడంతో బస్సుల కోసం జనం పడిన కష్టాలు అన్నీ ఇన్ని కావు. ప్రజా గొంతుకను వినిపించే మీడియాపై దాడులు చేయడం వైసీపీ విష సంస్కృతికి అద్దం పడుతోంది. అనంతపురం సభలో జరిగిన దాడిని ప్రజలంతా ఖండించాలి. వైసీపీ ఫ్యాన్ రెక్కలను విరిచి తమ శక్తి ఏంటో ప్రజలు నిరూపించే సమయం దగ్గర్లోనే ఉంది.



శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

వైసీపీని గద్దె దించేందుకు ప్రజలు సిద్ధం : కోట్ల సుజాతమ్మ



ఆంధ్రజ్యోతి విలేకరి కృష్ణపై వైసీపీ నేతలు దాడి చేయడం నిరంకుశ పాలనకు నిదర్శనం. ఈ రాక్షస పాలకులను దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. 2024 ఎన్నికల్లో వైసీపీని ఓడించడానికి జనం కసితో సిద్ధంగా ఉన్నారు. రాయలసీమలోని 52 నియోజకవర్గాల్లో ప్రయాణికులను ఇబ్బంది పెట్టి ఆర్టీసీ, స్కూల్ బస్సులన్నీ లాక్కొని జనాన్ని బలవంతంగా రాప్తాడు సభకు తరలించారు. వచ్చే ఎన్నికలు వైసీపీ ఓటమి ఖాయం.

ఫొటో గ్రాఫర్‌పై దాడి హేయమైన చర్య

ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటో గ్రాఫర్ శ్రీకృష్ణపై రౌడీ మూకలు దాడీ చేయడం హేయమైన చర్య. ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాం. విధి నిర్వహణలో భాగంగా జర్నలిస్టులు ఎక్కడ రాజకీయ పార్టీలు, సభలు సమావేశాలు పెడితే వెళ్లి ఫొటోలు తీయడం, వార్తలు సేకరించడం రాజ్యాంగం కల్పించిన హక్కు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ప్రశ్నించే వారిపై రోజురోజుకూ దాడులు పెరుగుతున్నాయి.

డీసీసీ అధ్యక్షుడు కే బాబురావు

రాష్ట్రానికి ఇది దుర్దినం...



రాప్తాడులో ఆదివారం జరిగిన దాడి ఘటన రాష్ట్రానికి దుర్దినంగా భావించాలి. మృదు స్వభావి, అజాత శత్రువు. ఎవరికీ హాని చేయని వ్యక్తి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణ. కేవలం ఆంధ్రజ్యోతి బ్రాండ్‌లో ఉన్నాడనే కారణంతో వైసీపీ మూకలు నిస్సిగ్గుగా దాడులు చేయడం బాధాకరం. సీఎం సభలో సిద్ధం అనగానే ఇక్కడ వైసీపీ అల్లరి మూకలు శ్రీకృష్ణపై దాడులు చేశాయి. ప్రపంచాన్ని శాసించానని విర్రవీగిన నీరో చక్రవర్తే నేలకూలాడు.

- చల్లా నవీన్‌కుమార్ నాయుడు, ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జి

ఇది పాత్రికేయ వృత్తిపై జరిగిన దాడి



ఇది కచ్చితంగా పాత్రికేయ వృత్తిపై జరిగిన దాడే. పాత్రికేయ వృత్తిని వాయిస్ ఆఫ్ ది వాయిస్ లెస్ పీపుల్‌గా వర్ణిస్తారు. ప్రజలకు అండగా ఉంటూ వారి సమస్యలను వ్యక్తీకరిస్తూ న్యాయం చేసే దిశగా పాత్రికేయులు వృత్తి నిబద్ధత పాటిస్తున్నారు. రాప్తాడు ఎన్నికల సభలో ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి చేయడం అమానుష చర్య. దీన్ని లోతైన సమస్యగా చూడాలి. దీన్ని ప్రజా సమస్యగా చూడాలి. సీఎం సభకు కర్నూలులోని బస్సులన్నింటినీ తరలించారు. ప్రభుత్వాలు ప్రజా ప్రయోజనాలకు ఆటంకం కలిగిస్తూ, పబ్లిక్ సేవా రంగాన్ని సొంతత జాగీరుగా వాడుకున్న తీరును ఖండించాలి.

- పాణి, విరసం నాయకులు

రక్షణ చట్టాలు అమలు చేయాలి



జర్నలిస్టులపై ప్రతిరోజూ ఎక్కడో ఒక చోట దాడులు జరుగుతూనే ఉన్నాయి. తమకు వ్యతిరేకంగా వార్తలు రాసినా, ఫొటోలు వచ్చినా వైసీపీ నాయకులు భరించలేకపోతున్నారు. ప్రభుత్వంలోని తప్పులను ఎత్తిచూపడం, ప్రజలకు న్యాయం జరిగేలా చూడటం జర్నలిస్టుల బాధ్యత. కానీ మీడియా స్వేచ్ఛను హరిస్తూ దాడులకు పాల్పడుతూ, బెదిరింపులకు దిగడం సరైంది కాదు. రాప్తాడు దుండగులను వెంటనే గుర్తించి, వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి, కఠినంగా శిక్షించాలి. జర్నలిస్టులకు ప్రత్యేక రక్షణ చట్టాలను అమలు చేయాలి.

- ఈఎన్ రాజు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు

రెచ్చగొట్టేందుకే సిద్ధం సభ పెట్టారా..?



సిద్ధం సభ దేనికి పెట్టారు..? రౌడీలను రెచ్చగొట్టేందుకే పెట్టారా...? గూండాలను దాడులు చేసేందుకు పెట్టారా..? ఇదే జగన్ రెడ్డి పాదయాత్ర సమయంలో ఇదే ఆంధ్రజ్యోతి పెద్దపెద్ద ఫొటోలు వేసి కవర్ చేసింది. ఆరోజు ఏమీ మాట్లాడలేదేం..? సిద్ధం సభలో ఫొటోగ్రాఫర్‌ను ఏ పత్రికో అడిగి తెలుసుకొని మరీ దాడి చేయడం దుర్మార్గమైన చర్య. ఇది రౌడీ రాజ్యానికి నిదర్శనం. ఆయనకూ ఒక చానెల్, ఒక పత్రిక ఉంది. ఇది గ్రహించాలి. నిందితులను అరెస్టు చేసి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి. శ్రీకృష్ణకు పూర్తి వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరించాలి.

- గోరంట్ల కొండప్ప, ఐజేయూ జాతీయ కమిటీ సభ్యుడు

జగన్ ప్రభుత్వంలో దాడులు పెరిగాయి..



జగన్ ప్రభుత్వంలో జర్నలిస్టులపై దాడులు పెరిగాయి. రాప్తాడులో జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం. అది మారుమూల ప్రాంతంలో జరిగిన దాడి కాదు, చోటామోటా నేతలు పాల్గొన్న సభ కాదు. ఎమ్మెల్యేలు, మంత్రుల సభ కూడా కాదు. సాక్ష్యాత్తు సీఎం పాల్గొన్న సభలో ఫొటోగ్రాఫర్‌పై రౌడీ మూకలు దాడి చేయడం బాధాకరం. జగన్‌రెడ్డి ప్రజలకు ముఖ్యమంత్రా, రౌడీలకు ముఖ్యమంత్రా..? ఆయనకు వ్యతిరేకంగా ఎవరైనా సభలు, సమావేశాలు, ధర్నాలు చేసినా, ఫొటోలు తీసినా, మీడియాలో రాసినా ఆయనకు మింగుడు పడటం లేదు. తక్షణం తన పోకడలు, విధానాలు మార్చుకొని సీఎం వెంటనే దాడి చేసిన వారిని అరెస్టు చేయించాలి.

- జగన్నాథం, సీపీఐ రాష్ట్ర నాయకుడు

జర్నలిస్టులకు సీపీఎం అండగా నిలుస్తుంది



రాప్తాడు దాడి ఘటనను సీపీఎం తీవ్రంగా ఖండిస్తోంది. ముఖ్యమంత్రి ఈ అంశంపై వెంటనే స్పందించాలి. దుండగులను గుర్తించి వారిపై హత్యాయత్నం కేసులు నమోదు చేసి, కఠినంగా శిక్షించాలి. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులు చేసే పోరాటాలకు సీపీఎం అండగా నిలుస్తుంది. రాజ్యాంగానికి విరుద్ధంగా జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారు. అధికారంలో ఎవరైనా ఉండవచ్చు. రేపు దిగిపోవచ్చు. కానీ అధికారంలో ఉన్నామనే అహంభావంతో దాడులకు పాల్పడితే ప్రజలే బుద్ధి చెబుతారు.

- గౌస్ దేశాయ్, సీపీఎం జిల్లా కార్యదర్శి

ప్రజాస్వామ్యంలోనే ఉన్నామా..?

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ మీద దాడితో మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా.. లేక ఆటవిక రాజ్యంలో ఉన్నామా అనే అనుమానం కలుగుతోంది. ఈ దాడి హేయమైన చర్య. రాజ్యాంగ హక్కులను జగన్ ప్రభుత్వం హరించి వేసింది. ప్రభుత్వం చేస్తున్న తప్పులను ఎత్తి చూపే జర్నలిస్టులపై దాడి చేసిన వైసీపీ గూండాలపై హత్యాయత్నం కేసులు నమోదు చేయాలి.

జె. లక్ష్మీనరసింహ యాదవ్, నంద్యాల డీసీసీ అధ్యక్షుడు

జర్నలిస్టులపై దాడులు పిరికి చర్య నేషపోగు కిరణ్మయి



కోడుమూరు: ఆంధ్రజ్యోతి అనంతపురం స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు దాడులు చేయడం పిరికి చర్య అని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నేషపోగు కిరణ్మయి అన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ రాప్తాడులో నిర్వహించిన సీఎం జగన్ సిద్ధం సభలో విధులు నిర్వహిస్తున్న ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై కక్ష కట్టి వైసీపీ గూండాలు ఆటవికంగా దాడులకు పాల్పడటం సిగ్గు చేటన్నారు. జర్నలిస్టులపై దాడులను ఖండించాల్సిన ముఖ్యమంత్రి జగన్ మరింత రెచ్చగొట్టేలా మాట్లాడుతుండటం ప్రజాస్వామ్యంలో మంచిది కాదన్నారు. దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.



కర్నూలు కలెక్టరేట్ ఎదుట జర్నలిస్టులు, ప్రజా సంఘాల నిరసన

రాప్తాడు ఘటన పునరావృతం కాకుండా చూడాలి



రాప్తాడులో ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై జరిగిన దాడిని అన్ని వర్గాలు ఖండించాలి. నిందితులపై కేసులు నమోదు చేసి, కఠిన శిక్షలు విధించే వరకు పోరాటాలు చేయాలి. రాప్తాడు ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి. ఈ సమస్యను జాతీయ స్థాయి వరకు తీసుకుపోయి శ్రీకృష్ణ కుటుంబానికి న్యాయం చేయాలి. శ్రీకృష్ణ కుటుంబానికి మేము అండగా ఉంటాం.

- మల్లెల రాజశేఖర్, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు

'జర్నలిస్టులపై దాడులు అరికట్టాలి'

కర్నూలు (కల్చరల్), ఫిబ్రవరి 19: జర్నలిస్టులపై దాడులు అరికట్టాలని, ప్రభుత్వం తక్షణమే జర్నలిస్టులకు రక్షణ చట్టాలను అమలు చేయాలని ఫొటో, వీడియో జర్నలిస్టుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మీసాల రామస్వామి అన్నారు. అనంతపురం జిల్లా రాప్తాడులో ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు చేసిన దాడిని నిరసిస్తూ తగిన చర్యలు తీసుకోవాలని సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ జి. సృజనకు ఆయన వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో రోజురోజుకూ జర్నలిస్టులపై దాడులు పెరుగుతున్నాయని, దాడులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యుడు రవి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుపై దాడి అప్రజాస్వామికం



అనంతపురం జిల్లా రాప్తాడు సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి చేయడం అప్రజాస్వామికం. దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం. రాష్ట్రంలో జర్నలిస్టులు, అమాయక ప్రజలపై దాడులు చేసేందుకే సీఎం జగన్‌రెడ్డి సిద్ధం సభలను నిర్వహిస్తున్నారు. దాడులు, దౌర్జన్యాలు వంటి హత్యా రాజకీయాలకు పాల్పడటం హేయమైన చర్య. తక్షణమే వైసీపీ మూకలను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

- టీడీపీ సీనియర్ నేత విష్ణువర్ధన్‌రెడ్డి

పిరికి పందల చర్య

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై జరిగిన దాడి పిరికి పందల చర్య. విధి నిర్వహణలో సభలో ఫొటోలు తీస్తున్న కృష్ణపై దాడి పథకం ప్రకారమే జరిగింది. ఒక పత్రికకు అధిపతిగా ఉన్న సీఎం జగన్ బహిరంగ సభలోనే మీడియాపై దాడి చేయడం దుర్మార్గమైన చర్య. దాడి చేసిన అల్లరిమూకలపై చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలి.

- మూల్పూరి ప్రభాకర్ చౌదరి, ఏపీజేఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి

ఫ్యాన్ రెక్కలు విరిచేందుకు ప్రజలు సిద్ధం



బనగానపల్లె, ఫిబ్రవరి 19: సీఎం జగన్ 58 నెలల పాటు నిరంకుశ పాలనలో కష్టాలు అనుభవిస్తున్న ప్రజలు ఫ్యాన్ రెక్కలు విరిచేందుకు సిద్ధంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ జగన్ సిద్ధం సభ దృశ్యాలు చిత్రీకరించేందుకు వెళ్లిన ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు దాడి చేయడం అమానుషం అన్నారు. ఇలాంటి వ్యక్తి మనకు సీఎం కావడం సిగ్గుచేటని అన్నారు. జగన్ రూ10లు ఇచ్చి వంద రూపాయలు దోచుకుంటున్నాడని అన్నారు. 58 నెలల పాలనలో రాష్ట్రంలో ఎక్కడా అభివృద్ధి లేదని, ఎక్కడ చూసినా వైసీపీ విధ్వంసం కనిపిస్తోందని అన్నారు. రాయలసీమలోని 52 నియోజకవర్గాల్లో ప్రయాణికులను ఇబ్బందిపెట్టి ఆర్టీసీ, ప్రైవేటు బస్సులను బలవంతంగా రాప్తాడు సభకు తరలించారని అన్నారు. టీడీపీ తెచ్చిన 120 సంక్షేమ పథకాలు జగన్ రద్దు చేసి వాటిని పేర్లు మార్చి తాను ఏదో కొత్తపథకం ఇస్తున్నట్లు డబ్బా కొట్టుకుంటున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాకు చెందిన సబ్‌ప్లాన్ నిధులు లక్ష కోట్ల రూపాయలు దారి మళ్లించారన్నారు. చంద్రబాబు పేరు చెబితే దళితులకు సబ్‌ప్లాన్ నిధులు రుణాలు, నిరుద్యోగ భృతి, 1.50 లక్షల టీచర్ పోస్టులు రైతు రుణమాఫీ, అన్నదాత సుఖీభవ, పసుపుకుంకుమ, చంద్రన్న బీమా, అమరావతి రూ. 16 లక్షల కోట్ల పెట్టుబడులు, 10లక్షల ఉద్యోగాలు పోలవరం గుర్తుకు వస్తాయన్నారు. జగన్ పేరుచెబితో బాబాయి వైఎస్ వివేకానందరెడ్డిపై గొడ్డలిపోటు పొడిచి హత్య చేయడం, కోడికత్తి శ్రీను, ప్రభుత్వ టెర్రరిజం, ల్యాండ్, మైనింగ్, శాండ్, వైన్ మాఫియా గుర్తుకు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బురానుద్దీన్, కాశీంబాబు, రాయలసీమ సలాం, పూలకాశీం, అల్తాఫ్‌హుసేన్, నియాజ్‌హుసేన్, గొండా రజాక్, హర్షద్, తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ రెక్కలు విరిచేందుకు ప్రజలు సిద్ధం

గౌరు దంపతులు

కల్లూరు, ఫిబ్రవరి 19: రాబోయే ఎన్నికల్లో వైసీపీ ఫ్యాన్ రెక్కలు విరిచేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని పాణ్యం టీడీపీ ఇన్‌చార్జ్ గౌరుచరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జ్ గౌరు వెంకటరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం తమ స్వగృహంలో టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌తో కలిసి గౌరు దంపతులు సమావేశం నిర్వహించారు. తెలుగుదేశం స్వర్ణయుగం పాలన.. వైసీపీ రాతియుగం పరిపాలనపై చర్చకు సిద్ధమని గౌరు దంపతులు అన్నారు. రాష్ట్రంలో సిద్ధం అంటూ సభలు అబద్ధాలు చెప్పడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమని రూ.10 ఇచ్చి వంద దోచేసి సంక్షేమం అంటున్నారని ఆరోపించారు. అన్నివర్గాల ప్రజలను మోసం చేస్తూ సామాజిక ద్రోహం చేస్తున్న జగన్‌కు మాట్లాడే అర్హతలేదన్నారు. రాయలసీమలోని 52 నియోజకవర్గాల్లో ప్రయాణికులను ఇబ్బంది పెట్టి ఆర్టీసీ, స్కూల్ బస్సులు లాక్కుని జనాలను బలవంతంగా రాప్తాడు సభకు తరలించారని విమర్శించారు. వార్తల కవరేజీకి వెళ్లిన ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ మీద వైసీపీ రౌడీమూకలతో ఎందుకు దాడిచేశారో చెప్పాలని ప్రశ్నించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలోని 120 సంక్షేమ పథకాలు జగన్ రద్దు చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్‌యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, కాసాని మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గౌరు దంపతులు, మల్లెల రాజశేఖర్


హత్యాయత్నం కేసులో ఐదేళ్ల జైలు శిక్ష

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 19 : బనగానపల్లె సర్కిల్ నందివర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని పలుకూరు గ్రామానికి చెందిన గోవర్దన్ అనే నిందితుడికి హత్యాయత్నం కేసులో నంద్యాల రెండో అడిషనల్ అసిస్టెంట్ సీనియర్ కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. పలుకూరు గ్రామంలో గోవర్దన్ అదే గ్రామానికి చెందిన ఓ మహిళను ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి వైర్‌తో గొంతు బిగించి చంపేందుకు ప్రయత్నించాడని 2019లో నందివర్గం పోలీసు స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు మీద దర్యాప్తు చేసిన ఎస్సై కె. శ్రీహరి విచారణ అనంతరం కోర్టులో చార్జిషీటు దాఖలు పరిచారు. కేసు విచారణలో నేరం రుజువైనందున న్యాయాధికారి నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.3,500 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసు విచారణలో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం. వివేకానందరెడ్డి ప్రాసిక్యూషన్ తరఫున వాదనలు వినిపించారు.

జగన్‌ను ఇంటికి పంపడమే లక్ష్యం

● వైసీపీ పాలనలో చెలరేగిపోతున్న మద్యం, ఇసుక మాఫియాలు

● మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి



కర్నూలు(ఎడ్యుకేషన్),ఫిబ్రవరి 19: మనందరి అజెండా, లక్ష్యం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ఇంటికి సాగనంపడమే కావాలని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక బైరెడ్డి ఫంక్షన్ హాలులో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు, ఉద్యోగులు, వ్యాపారులు, ప్రజా ప్రతినిధులు సైతం అసంతృప్తితో ఉన్నారన్నారు. అధికార పార్టీ నాయకులు భూకబ్జాలకు పాల్పడితే.. వాటిని అరికట్టాల్సిన అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో ఇసుక, మద్యం మాఫియా పెట్రేగిపోతున్నారని అన్నారు. ఇంటి మరమ్మతులకు కూడా ప్రజలకు ఇసుక దొరకడం లేదంటే పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో ఇట్టే అర్థం అవుతున్నదని అన్నారు. జగన్ పాలనలో ఉద్యోగులు, కార్మికులు నలిగిపోతున్నారని, వీరిలో ఒక్కరు కూడా వైసీపీకి ఓటేసే పరిస్థితి లేదన్నారు. నిరుద్యోగులు ఉద్యోగాలు దొరక్క విలవిల్లాడుతున్నారని, ఎన్నికల ముందు సీఎం తూతూ మంత్రంగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి నిరుద్యోగ యువతను మోసం చేస్తున్నారని బైరెడ్డి ఆరోపించారు. ఇది అప్లికేషన్ల డబ్బు దండుకోడానికే తప్ప.. ఉద్యోగాలను భర్తీ చేసేందుకు కాదన్నారు. ఎమర్జెన్సీ పెట్టినప్పుడు కూడా దేశంలో ఇలాంటి పరిస్థితి లేదన్నారు. ఈ రాష్ట్రాన్ని ఎవరూ బాగుపరచలేరని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కొత్తగా ఒక ప్రాజెక్టునైనా కట్టారా? అని సీఎం జగన్‌ను బైరెడ్డి ప్రశ్నించారు. పోలవరం తల నరికి మొండాన్ని వేరు చేశారన్నారు. ప్రపంచంలోనే రాజధాని లేని రాష్ట్రం ఏదైనా ఉందంటే అది ఆంధ్రప్రదేశ్ మాత్రమే అన్నారు. రాష్ట్రంలో దుర్మార్గమైన పరిపాలన కొనసాగుతుందని ఆయన ఆరోపించారు. రాయలసీమ ఎడారిగా మారిందని కనీసం ఒక ప్రాజెక్టును కూడా నిర్మించలేదని అన్నారు. అలగనూరు ప్రాజెక్టు తెగితే.. కనీసం దానికి మరమ్మతులు చేపట్టే పరిస్థితులు లేవన్నారు. గుండ్రేవులకు నిధులు కేటాయించలేదన్నారు. కృష్ణానదిపై తీగల వంతెన వద్దని, బ్రిడ్జి కం బ్యారేజీ నిర్మిస్తే.. 60 టీఎంసీల నీరు నిల్వఉంటుందని చెబితే.. కేంద్ర జలవనరుల శాఖ మంత్రి, ప్రధానమంత్రి పట్టించుకోలేదన్నారు. కరువు నివారణ చర్యలు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇంటి పన్నులు అమాంతంగా పెంచేశారని, కరెంటు బిల్లులు కట్టలేక పేద, మధ్యతరగతి ప్రజలు అల్లాడుతున్నారని తెలిపారు. పేదల ఇళ్లకు అధిక కరెంటు బిల్లులు వస్తుండటంతో తమకు చెందాల్సిన అమ్మఒడి, ఆసరా, చేయూత వంటి పథకాలను రద్దు చేస్తుండటంతో వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని బైరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

రాష్ట్రపతిని కలిసిన టీజీ వెంకటేశ్



కర్నూలు (కల్చరల్), ఫిబ్రవరి 19: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మును మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము టీజీ వెంకటేశ్‌కు సంసద్ మహారత్న అవార్డు జ్ఞాపికలను, ప్రశంసాపత్రాన్ని అందజేసి అభినందించారు. 2019 నుంచి 2022 వరకు ఆరు శాఖల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా అత్యుత్తమ సేవలు అందించిన టీజీ వెంకటేశ్‌కు ప్రైమ్ పాయింట్ ఫౌండేషన్ అనే సంస్థ ఈ అవార్డును ప్రకటించింది.

ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులు

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 19: అర్హులైన జర్నలిస్టులు ఇళ్ల స్థలాల కోసం ఈ నెల 26 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ విజయకుమార్ రెడ్డి సోమవారం తెలిపారు. రాష్ట్రంలో వివిధ మీడియా సంస్థల్లో పని చేస్తూ అక్రిడిటేషన్ కార్డు ఉన్న జర్నలిస్టులకు హౌసింగ్ స్కీం కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు.

జర్నలిస్టులు ఐక్యంగా ముందుకు సాగాలి

● ఆత్మకూరు ఏపీయూడబ్ల్యూజే నూతన కమిటీ ఎంపిక



మాట్లాడుతున్న ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకుడు శ్యాంసుందర్‌లాల్

ఆత్మకూరు, ఫిబ్రవరి 19: జర్నలిస్టులు ఐక్యతతో ముందుకు సాగాలని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు శ్యాంసుందర్‌లాల్, నంద్యాల జిల్లా అధ్యక్షుడు మధుబాబు, నంద్యాల జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు చలం బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉస్మాన్‌బాషా అన్నారు. సోమవారం ఆత్మకూరులోని కొండా గార్డెన్‌లో ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ నూతన కమిటీ ఎన్నిక కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడిగా ఆత్మకూరు ఆంధ్రజ్యోతి రిపోర్టర్ కృష్ణతోపాటు గౌరవాధ్యక్షుడు శశిధర్, సలహాదారు నాగేశ్వరరావు, కార్యదర్శి సైఫుద్దీన్, ఉపాధ్యక్షులుగా మౌలాహుసేన్, సుల్తాన్, పెద్దబాబు, మల్లయ్య, సహాయ కార్యదర్శులుగా వినోద్, ఆనంద్, శివ, నరేష్‌రెడ్డి, బాలమద్దిలేటి, సహాయ కోశాధికారిగా కార్యదర్శిగా విజయ్‌కుమార్, సభ్యులుగా శ్రీనివాసులు, షఫి, బాలరాజుగా ప్రకటించారు. అనంతరం నూతన ఘనంగా సత్కరించి నియామక పత్రాలను అందజేశారు.

మార్కెట్‌యార్డులో విజిలెన్స్ తనిఖీలు

నందికొట్కూరు రూరల్ ఫిబ్రవరి 19 : నందికొట్కూరు మార్కెట్ యార్డు పశువుల సంత మార్కెట్‌లో జిల్లా విజిలెన్స్ అధికారి ఏడీఎం అబ్దుల్ రహిమాన్ ఐదుగురి బృందంతో తనిఖీలు నిర్వహించారు. సోమవారం నందికొట్కూరు మార్కెట్ యార్డులో ప్రతి సోమవారం గొర్రెలు, గేదెలు, ఎద్దులు, పశువుల అమ్మకాలు కొనుగోలు భారీ స్థాయిలో జరుగుతాయి. వీటి విషయంలో ఇక్కడి అధికారులు అవకతవకలకు పాల్పడుతున్నారని స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు చేయడంతో విజిలెన్స్ బృందం తనిఖీలు చేపట్టినట్లు తెలిసింది. అధికారులు రికార్డులను, పశువుల అమ్మకాలపై రశీదులను పరిశీలించారు. రూ.10 వేల దాకా తేడా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. గత సంవత్సరం పశువుల సంత 2022 - 2023కు గాను రూ.25,000 వచ్చినట్లు అధికారులు తెలిపారు. తనిఖీలలో శ్రీనివాసులు, విశ్వేశ్వర్, సురేష్, సుభాష్ రెడ్డి, బృందం పాల్గొన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి

గోస్పాడు, ఫిబ్రవరి 19 : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు వెంటనే మధ్యంతర భృతిని చెల్లించాలని పీఆర్‌టీయూ నాయకులు సుబ్బరాయుడు నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం గోస్పాడులో మాట్లాడుతూ ప్రభుత్వం 12వ వేతన సవరణ సంఘం ప్రకటించేలోపు 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు విజయరావు, సురేష్‌శర్మ, రాజశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

జూపాడుబంగ్లా, ఫిబ్రవరి 19: జూపాడుబంగ్లాలో సోమవారం తెల్లవారుజామున షార్ట్ సర్క్యూట్ జరగడంతో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. గ్రామానికి చెందిన 70 ఏళ్ల రమణయ్య అనే వృద్ధుడు గుడిసెలో నిద్రిస్తుండగా ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్ జరిగింది. మంచం, కుర్చీలు కాలిపోతుండగా నిద్రమత్తులో ఉండగా కాళ్లకు కాలి తీవ్ర గాయాలయ్యాయి. కేకలు వేయడంతో పక్క గదిలో పడుకున్న ఆయన మనవడు భరత్ నీటితో ఆర్పి అతనిని 108 వాహనంలో కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు విచారిస్తున్నారు.

సమ్మె విరమించేది లేదు



ఏడీఆర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

నంద్యాల టౌన్, ఫిబ్రవరి 19 : ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అనుబంధ నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో పని చేసే కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు సమ్మె విరమించేది లేదని ఆర్‌ఏఆర్‌ఎస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) గౌరవాధ్యక్షుడు లక్ష్మణ్, రాష్ట్ర అధ్యక్షుడు పుల్లయ్య స్పష్టం చేశారు. సోమవారం మూడో రోజు సమ్మెలో భాగంగా ఏడీఆర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అక్కడే బైఠాయించి ధర్నా చేశారు. అనంతరం ఏడీఆర్ డాక్టర్ ఎన్‌సీ వెంకటేశ్వర్లుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరమ్మ, అయ్యన్న, రమణయ్య దివాకర్, నాగరాజు, చిన్న నరసయ్య, సుజాత, రమ్యా, వెంకటలక్ష్మి, పలువురు కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయండి: కలెక్టర్

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 19: జిల్లాలోని 0-5 సంవత్సరాల లోపు పిల్లలందరికి పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటనరీ హాలులో కలెక్టర్ అధ్యక్షతన పల్స్‌పోలియో నేషనల్ ఇమ్యునైజేషన్ డేపై జిల్లా స్థాయి అధికారులతో జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 3న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విద్యాశాఖ, రెవెన్యూ, విద్యుత్, పంచాయతీరాజ్ శాఖ తదితర లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులందరూ సమన్వయంతో పనిచేసి జిల్లాలోని 0-5 సంవత్సరాల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయాలని అధికారులను ఆదేశించారు.

43 రిజిస్టర్‌లో అర్చకుల పేర్లు నమోదు చేయాలి

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 19: వంశపారంపర్యంగా దేవాలయాలలో పనిచేసే అర్చకులకు 43 రిజిస్టర్‌లో వారి పేర్లను నమోదు చేయాలని దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ సంబంధిత అధికారులకు ఆదేశించారు. సోమవారం భీమలింగేశ్వరస్వామి దేవస్థానంలో అర్చక, దేవదాయ ఉద్యోగస్తుల సమీక్ష సమావేశం నిర్వహించారు. అర్చకులకు రైతు భరోసా, ధూపదీప నైవేద్యాలు, ప్రతి అర్చకుడికి 15వేలు జీతం తగ్గకుండా జీతాలు ఇవ్వాలని, తదితర అర్చకుల సమస్యలు అర్చకులు కమిషనర్ దృష్టికి తెచ్చారు. అన్నింటిని పరిష్కరిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్‌ను సుధాకర్ రెడ్డి, ఉపకమిషనర్ గురుప్రసాద్‌ను, ఆర్జేడీ వెంకటేశ్వర్లు, ఉమ్మడి కర్నూలు, ఉమ్మడి కడప, ఉమ్మడి అనంతపూర్ జిల్లాల నుంచి అర్చకులు, దేవదాయ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

పొదుపు గ్రూపు సొమ్ము స్వాహా

నందికొట్కూరు రూరల్ ఫిబ్రవరి 19 : నందికొట్కూరు మండలంలోని నాగటూరు గ్రామ పొదుపు గ్రూపు మహిళలు తమ గ్రూపులలో రూ. 18 లక్షల దాకా అవినీతి జరిగిందని నందికొట్కూరులోని శ్రీశక్తి భవనం వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. సోమవారం నందికొట్కూరు పట్టణంలోని శ్రీశక్తి భవనం వద్ద నాగటూరు గ్రామ పొదుపు మహిళలు తమ గ్రూపుల పరిధిలో రూ 18 లక్షల దాకా అవినీతి జరిగిందని ఆందోళన చేపట్టారు. దీని విషయమై నందికొట్కూరు గ్రామీణ ప్రాంత ఏపీఎమ్ మధుసుదర్శన్ మాట్లాడుతూ నాగటూరు గ్రామంలో సరస్వతి గ్రామైక్య సంఘం పరిధిలో 31 సంఘాలున్నాయని, అందులో 12 పొదుపు గ్రూపు సంఘాలలో దాదాపుగా రూ 12 లక్షలు అవినీతి జరిగిందని ఏపీఎమ్ మధు సుదర్శన్ తెలిపారు. 12 గ్రూపులలో ఉన్నతి రుణాలు రూ 9.8లక్ష దాకా, శ్రీనిధి రుణాలు రూ 1.5 వేల రూపాయల దాకా బకాయిలు ఉన్నాయన్నారు. కానీ ఈ రుణాలతో తమకు సంబంధం లేదని గ్రూపు మహిళలు అన్నారు. ఈ డబ్బంతా ఎక్కడి కి పోయిందని బుక్ కీపర్‌ను అడిగితే సరైన సమాధానం చెప్పడం లేదన్నారు. కానీ ఇక్కడ గ్రామంలో బుక్ కీపర్‌గా వుంటున్న విజయ నిర్మల ఆమె భర్త పుల్లం రాజులు అవినీతికి పాల్పడినట్లు ఆయన తెలిపారు. పొదుపు మహిళలు గ్రామ బుక్ కీపర్, ఆమె భర్త పుల్లం రాజుపై ఇచ్చిన ఫిర్యాదును జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళతామన్నారు.



ఆత్మకూరులో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు, ప్రజాసంఘాల నాయకులు



పాణ్యం తహసీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న జర్నలిస్టులు, ప్రజా సంఘాల నాయకులు

పెల్లుబుకిన ఆగ్రహం

● జిల్లాలో జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

● అనంతపురం ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై దాడిని ఖండించిన టీడీపీ తదితర రాజకీయ పార్టీలు

● దాడికి పాల్పడిన వైసీపీ మూకలను అరెస్టు చేయాలని డిమాండ్

అనంతపురం ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ కృష్ణపై వైసీపీ మూకల దాడిని నిరసిస్తూ సోమవారం జిల్లాలో ఆగ్రహం పెల్లుబుకింది. జర్నలిస్టు సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో నిరసనలు వెలువెత్తాయి. నిందితులను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఆత్మకూరు, ఫిబ్రవరి 19: జర్నలిస్టులపై దాడికి పాల్పడటం దుర్మార్గమైన చర్య అని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకుడు శ్యాంసుందర్‌లాల్, నంద్యాల జిల్లా అధ్యక్షుడు మధుబాబు, నంద్యాల జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు చలం బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉస్మాన్‌బాషా పేర్కొన్నారు. అనంతపురం జిల్లాలోని రాప్తాడులో జరిగిన సిద్ధం సభలో కవరేజ్‌కు వెళ్లిన ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టు శ్రీకృష్ణపై వైసీపీ మూకలు దాడికి పాల్పడాన్ని నిరసిస్తూ.. సోమవారం ఆత్మకూరు పట్టణంలోని గౌడ్ సెంటర్‌లో కేజీరోడ్డుపై రాస్తారోకో చేపట్టారు. వారు మాట్లాడుతూ.. దాడికి పాల్పడిన నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆత్మకూరు డివిజన్ ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షులు కృష్ణ మాట్లాడుతూ.. ఫొటో జర్నలిస్టుపై కృష్ణపై జరిగిన దాడికి సీఎం జగన్ నైతిక బాధ్యత వహించాలని అన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని అక్కడ తహసీల్దార్ కే.బాబుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఏపీయూడబ్ల్యూజే నాయకులు ఇస్మాయిల్, చంద్ర, శ్యాం, రవికుమార్, శివ, మణికంఠ, శశిధర్, నాగేశ్వరరావు, సైఫుద్దిన్, జలంధర్, వహిద్, భాస్కరగౌడ్, ఆనంద్, సురేష్, వినోద్, శివన్న, నరేష్‌రెడ్డి, చాంద్‌బాషా, మల్లికార్జున, మల్లయ్య, శ్రీనివాసులు, షఫి, బాలరాజు, పెద్దబాబు తదితరులు ఉన్నారు.

● ఫొటో జర్నలిస్టు కృష్ణపై జరిగిన దాడికి ఖండిస్తూ ఆత్మకూరులో జర్నలిస్టు సంఘాలతో పాటు పలు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు రామకృష్ణ, వేణుగోపాల్, నాగూర్‌ఖాన్, జనసేన నాయకులు శ్రీరాములు, సీపీఎం నాయకులు ఏసురత్నం మాట్లాడారు. మీడియాపై దాడులు సరైన సంస్కృతి కాదని వారు ఎద్దేవా చేశారు. మీడియా ప్రతినిధులపై దాడి చేయడం బాధాకరమని అన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కే.బాబుకు వినతిపత్రాన్ని అందజేశారు.

పాములపాడు: ఫొటోగ్రాఫర్ క్రిష్ణపై వైసీపీ గూండాలు దాడి చేయడం ప్రజాస్వామ్యంలో సిగ్గుచేటని మండల తెలుగుయువత అధ్యక్షుడు మధు క్రిష్ణ అన్నారు. ఆయన పాములపాడులో మాట్లాడుతూ వైసీపీ పాలనలో ప్రశ్నించిన అధికారులపై దాడులు బెదిరింపులు, మీడియాపై దాడులు రౌడీలు రాజ్యమేలితే ఈ విధంగానే ఉంటుందన్నారు. విలేఖరిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని లేకపోతే తెలుగుయువత ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో లింగేశ్వరగౌడ్, ఉస్మాన్‌బాషా, ప్రదీప్, ఆరె చంద్రశేఖరరావు, బాబావలి, ఖాశీ తదితరులు పాల్గొన్నారు.

పాణ్యం: ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై వైసీపీ రౌడీమూకలు దాడి చేసిన సంఘటనకు నిరసనగా సోమవారం స్థానిక జాతీయ రహదారిపై మండల విలేకరుల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు టీడీపీ, సీపీఎం, సమాజ్‌వాది పార్టీ, ఆల్ ఇండియా ఫా ర్వర్డ్ బ్లాక్, సీఐటీయూ, ఎస్‌ఎఫ్‌ఐ, మాలమహానాడు, ఏపీడబ్ల్యూజెఎఫ్ సంఘాలు మద్దతు పలికాయి. అనంతరం తహసీల్దారు ఫణికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో విలేకరులు ఏకేశ్రీనివాసులు, రాజు, శీను, నబి, ఇప్సాసుధాకర్, వేణుగోపాల్, మాజీ జెడ్పీటీసీ నారాయణమ్మ, టీడీపి నాయకులు రామమోహన్‌నాయుడు, రమణ మూర్తి, ఖాదర్‌బాషా, నాగేషుడు, సుబ్బయ్య, రవి, సీపీఎం నాయకులు భాస్కర్, మాలమహానాడు నాయకులు దేవదత్తు, సమాజ్‌వాదీ పార్టీ నాయకులు శివకృష్ణయాదవ్, ఏఐఎఫ్‌బీ నాయకులు వెంకటాద్రి, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ప్రతాప్ పాల్గొన్నారు.

నందికొట్కూరు: ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడికి పాల్పడటం సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే సిగ్గుచేటని విద్యార్థి, ప్రజాసంఘాల నాయకులు అన్నారు. సోమవారం ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో నందికొట్కూరు పట్టణంలో రాస్తారోకో నిర్వహించి నిరసన ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ, సీపీఎం, ఐకాసా విద్యార్థి సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు శ్రీనివాసులు మాట్లాడుతూ విధినిర్వాహణలో ఫోటోలు తీస్తున్న ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై వైసీపీ మూకలు దాడిచేయడం అమానుషమన్నారు. సిద్ధం సభకు అధ్యక్షత వహించిన రాప్తాడు ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయాలన్నారు. సీపీఎం నాయకులు నాగేశ్వరరావు మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడులు అధికమయ్యాయని, పదేపదే దాడిచేయించడం ప్రభుత్వానికి తగదన్నారు. ఏపీ రైతు సంఘం నాయకులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజాసమస్యలను పరిష్కరించే దిశలో పనిచేసే జర్నలిస్టులపై దాడి చేయడం హేయమైనచర్య అని అన్నారు. ఏఐఎస్‌ఎఫ్ నాయకులు మహానంది మాట్లాడుతూ జర్నలిస్టుల రక్షణకోసం సుప్రీంకోర్టు తీసుకొచ్చిన చట్టాలు కాగితాలుగానే మిగిలాయని, దాడులు మాత్రం ఆగడంలేదని అన్నారు. అనంతరం తహసీల్దార్ దామోదర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐకాసా నాయకులు ఆది, బీసీ సంఘం నాయకులు కురుమూర్తి, రైతుసంఘం నాయకులు రాజు, జర్నలిస్టు సంఘాల నాయకులు రామాంజనేయులు, వెంకటేశ్, భాను, శేషు, సురేష్, జయరాజు, గోపి, స్వామన్న, స్వాములు, నాగరాజు, మల్లికార్జున, చంద్రశేఖర్, నాగేశ్వరరావు, సురేంద్ర, నజీర్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరులో రాస్తారోకో చేస్తున్న జర్నలిస్టులు



మహానందిలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు



నంద్యాలలో ధర్నాలో పాల్గొన్న టీడీపీ, ప్రజా సంఘాల నాయకులు



నందికొట్కూరులో మాట్లాడుతున్న టీడీపీ అధికార ప్రతినిధి కాకరవాడ వెంకటస్వామి

మీడియాపై దాడి చేయడం ఆటవిక చర్య

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మీడియాపై దాడి చేయించడం ఆటవిక చర్యని టీడీపీ అధికార ప్రతినిధి కాకరవాడ వెంకటస్వామి అన్నారు. సోమవారం ఆయన టీడీపీ నాయకులతో కలిసి మాట్లాడారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారాధులుగా ఉండి సమస్యల పరిష్కరించే పాత్రికేయులపై దాడిచేయించడం రౌడియిజానికి నిదర్శనమన్నారు. దాడులకు పాల్పడిన వారిపై కఠినంగా శిక్షించాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వేణుగోపాల్, రాజన్న, రవి, సతీష్ పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: ఫొటోగ్రాఫర్ కృష్ణపై దాడిచేసిన వైసీపీ అల్లరిమూకలపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని సీపీఐ జిల్లా నాయకులు రమేష్‌బాబు డిమాండు చేశారు. జూపాడుబంగ్లాలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జర్నలిస్టుల రక్షణకోసం ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని డిమాండు చేశారు. దివాకర్, పుల్లయ్య పాల్గొన్నారు.

గోస్పాడు: ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్ కృష్ణపై దాడి దారుణమని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కాటంరెడ్డి తులసీశ్వరరెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.

మహానంది: ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ గుండాలు ముకుమ్మడిగా దాడి చెయ్యడం హేమమైన చర్య అని నంద్యాల పార్లమెంట్ టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్ యాదవ్, మహానంది టీడీపీ ఇన్‌చార్జ్ గని చిన్న రంగస్వామిలు తెలిపారు. సోమవారం మహానందిలోని టీడీపీ కార్యాలయం ముందు మాట్లాడారు నిందితులను పోలీసులు వెంటనే అరెస్ట్ చెయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు తిరుమలేష్, మదన్,వెంకీలు పాల్గొన్నారు.

కొత్తపల్లి: ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై దాడి అమానుషమని కొత్తపల్లి మండల టీడీపీ కన్వీనర్ నారపురెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సీఎం సభలో ఒక విలేకరిపై దాడి చేస్తుంటే పోలీసులు ప్రేక్షకపాత్ర వహించడం సరైంది కాదన్నారు. కృష్ణను కాళ్లతో, పిడిగుద్దులు గుద్దడం చూస్తే చాలా బాధేసిందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో జర్నలిస్టులపై దాడులు అదికమయ్యాయని, ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రజల కోసం పాటు పడే పాత్రికేయులకు తమ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

● పాత్రికేయులపై దాడి అనాగరికచర్య



సిద్ధం సభ కవరేజ్‌కు వచ్చిన ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ గూండాలు కిరాతకంగా దాడికి పాల్పడ్డం అనాగరికచర్య. ప్రజాస్వామ్యంలో ఫోర్త్‌ఎస్టేట్‌గా ఉన్న మీడియాపై సీఎం జగన్మోహన్‌రెడ్డి సాక్షిగా భౌతికదాడులకు పాల్పడటం తీవ్రంగా ఖండిస్తున్నాం. దాడికి పాల్పడిన రౌడీలను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలి.

- బాబాఫక్రుద్దీన్, జిల్లా సహాయ కార్యదర్శి సీపీఐ, నంద్యాల

● దాడి చేసిన వారిని శిక్షించాలి



జర్నలిస్టుపై వైసీపీ గూండాలు బరితెగించి దాడికి పాల్పడటం హేయమైన చర్య. వైసీపీ ప్రభుత్వంలో సమాజం ఎటువైపు వెళ్తుందో అర్థంకాని పరిస్థితి నెలకొంది. తీవ్ర గాయాలతో కృష్ణ కుటుంబాన్ని ఆదుకోవాలి. దాడికి పాల్పడినవారిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలి.

-నాగరాజు, జిల్లా కార్యదర్శి సీఐటీయూ, నంద్యాల

● జర్నలిస్టులకు రక్షణ చట్టాన్ని తేవాలి



జగన్ సిద్ధం సభలు జర్నలిస్టులపై దాడులు చేసేందుకు సిద్ధం అన్నట్లు ఉంది. కవరేజ్‌కు వచ్చిన ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటో గ్రాఫర్‌పై వైసీపీ అల్లరి మూకలు బహిరంగంగా విచక్షణారహితంగా దాడికి పాల్పడటం రాక్షసత్వానికి నిదర్శనం. రౌడీ పాలన, అరాచక పాలనను ప్రజలు గమనిస్తున్నారు. వైసీపీ రౌడీ మూకలను ఎక్కడ ఉన్నా వెంటనే అరెస్టు చేసి శిక్షించాలి.

-షేక్ రియాజ్, రాష్ట్ర అధ్యక్షుడు, డెమోక్రటిక్ విద్యార్థి, యువజన సంఘం, నంద్యాల

చర్యలు తీసుకోవాలి



జర్నలిస్టుపై బహిరంగంగా భౌతికదాడికి పాల్పడిన వైసీపీ అల్లరి మూకలపై కఠిన చర్యలు తీసుకొని శిక్షించాలి. భౌతికదాడులకు పాల్పడుతున్నా పోలీసులు అడ్డుకోకుండా ప్రేక్షకపాత్ర వహించడం సిగ్గుమాలిన చర్య. వైసీపీ పాలనలో ప్రజాస్వామ్యం అనే పదానికి అర్థం లేకుండా పోయింది. రౌడీ పాలనను ప్రజలు తరిమివేసే సమయం ఆసన్నమైంది. దాడికి పాల్పడినవారిని అరెస్టు చేయకపోతే ప్రత్యక్ష ఆందోళకు సిద్ధమవుతాం.

-రఫీ, జిల్లా అధ్యక్షుడు పీడీఎస్‌యూ, నంద్యాల

జర్నలిస్టులపై దాడులు పిరికిపంద చర్య



ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటో గ్రాఫర్ శ్రీకృష్ణపై రౌడీ మూకలు దాడీ చేయడం హేయమైన చర్య. ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాం. విధి నిర్వహణలో భాగంగా జర్నలిస్టులు ఎక్కడ రాజకీయ పార్టీలు, సభలు సమావేశాలు పెడితే వెళ్లి ఫోటోలు తీయడం, వార్తలు సేకరించడం రాజ్యాంగం కల్పించిన హక్కు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ప్రశ్నించే వారిపై రోజురోజుకూ దాడులు పెరుగుతున్నాయి.

వృత్తి ధర్మంలో విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టులపై కిరాతకంగా, దుర్మార్గంగా బరితెగించి భౌతికదాడులకు పాల్పడటాన్ని టీడీపీ తీవ్రంగా ఖండిస్తోంది. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలి.

గోవిందునాయుడు, టీడీపీ నాయకుడు

- నంద్యాల (నూనెపల్లె)

వచ్చే ఎన్నికల్లో వైసీపీ అడ్రస్ గల్లంతే

- శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

ఆత్మకూరు, ఫిబ్రవరి 19: వచ్చే ఎన్నికల్లో వైసీపీ అడ్రస్ గల్లంతు కావడం ఖాయమని, ఇప్పటికే ఆ పార్టీ ఫ్యాన్ రెక్కలను విరిచేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ఆత్మకూరులోని టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 58నెలల పాటు అరాచక, నిరంకుశ పాలన సాగించి సిద్ధం సభలతో సీఎం జగన్ ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ఎవరిది అభివృద్ధి పాలనో, ఎవరిది విధ్వంస పాలనో ఇప్పటికే ప్రజలకు అర్థమైందని వివరించారు. జగన్‌కు పేదల గురించి మాట్లాడే అర్హతే లేదని, ఆయన పేదోళ్లు, పెత్తందారులు అనే కథలు చెప్పడం ఆశ్చర్యంగా వుందని వివరించారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి భవిష్యత్ వుంటుందని ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలందరు టీడీపీ, జనసేన పార్టీలకు మద్దతు ఇవ్వాలని ఆకాంక్షించారు.




టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

టీడీపీలోకి చేరిక

ఆత్మకూరు మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు సోమవారం శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సమక్షంలో టీడీపీలోకి చేరారు. వెంకటాపురం గ్రామ నాయకులు రాజారెడ్డి, ఈశ్వరరెడ్డిల ఆధ్వర్యంలో 5వ వార్డు సభ్యులు షేక్ మహెబూబ్ బాషా, మాజీ ఉపసర్పంచ్ వేల్పనూరు నబిరసూల్, నాయకులు గౌస్, మిద్దెసలాం, ఫిరోజ్, ఇంతియాజ్‌బాషా, మహ్మద్, రఫీతో పాటు మరో 20మంది టీడీపీలోకి చేరారు. వీరికి ఆత్మకూరులోని టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బుడ్డా టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు రమణ, ఈశ్వర్, మేస్త్రీ ముర్తుజా ఉన్నారు.

వైసీపీది విధ్వంస పాలన

నంద్యాల పార్లమెంట్ టీడీపీ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి



మాండ్ర సమక్షంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ నాయకులు

నందికొట్కూరు రూరల్ ఫిబ్రవరి 19 : వైసీపీ విధ్వంస పాలన సాగిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తోందని నంద్యాల పార్లమెంట్ టీడీపీ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. అల్లూరు గ్రామంలో మాండ్ర నివాసంలో మిడుతూరు మండలం కడుమూరు, ఉప్పలదడియ, మాస్‌పేట పాముల పాడు మండలం బానకచెర్ల గ్రామాల నుంచి వైసీపీ నాయకులు కొంతమంది సమక్షం లో మిడుతూరు మండలం నాయకులు చౌట్కూరు గోకారి, బ్రదర్ భాస్కర్, నందికొట్కూరు టీడీపీ నాయకులు గని ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. మాండ్ర మాట్లాడుతూ సీఎం జగన్ నియంత పాలన సాగిస్తూ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలకు సిద్ధమే అంటున్న వైసీపీ ప్రభుత్వాన్ని ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రతికార్యకర్త పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. టీడీపీలో చేరిన వారు కడుమూరు, ఉప్పల దడియ, మాస్‌పేటలో ప్రసాద్, డేవిడ్, బాలస్వామి, సుబ్బయ్య, సురేష్, రమేష్, కిశోర్, శంకర్, సంపత్, ప్రవీణ్, హరి, అయ్యస్వామి, ప్రతాప్, రాజు, బానకచెర్ల గ్రామం నుంచి చాంద్ బాషా, రజాక్ బాషా, సుమన్, బాలకృష్ణ, రాజు, రమేష్, లోకేష్, వళి, చందు మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో చేరారు. కార్యక్రమంలో షకీల్ అహ్మద్, జయసూర్య పాల్గొన్నారు.

డోన్

టీడీపీలోకి భారీగా చేరికలు



టీడీపీలో చేరిన వారితో బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, ఫిబ్రవరి 19: బనగానపల్లె నియోజకవర్గంలో వైసీపీకి షాక్‌ల మీద షాక్ తగులుతున్నాయి. బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో భారీ చేరికలు కొనసాగుతున్నాయి. సోమవారం కొలిమిగుండ్ల మండలం కనకాద్రిపల్లె గ్రామానికి చెందిన 40 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరికి బీసీ టీడీపీ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. కనకాద్రిపల్లె వైసీపీ నాయకులు దూదేకుల మాబుషా(బొజ్జన్న), దూదేకుల మద్దిలేటి, దూదేకుల కంబగిరి రాముడుతోపాటు 40 కుటుంబాలు బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో టీడీపీలో చేరారు. వీరికి బీసీ జనార్దన్‌రెడ్డి టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడపగలిగిన ఒకే ఒక నాయకుడు బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. బీసీ మాట్లాడుతూ వచ్చే రెండు నెలలు సమష్టిగా పనిచేసి వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు.

ఆళ్లగడ్డలో సైకిల్‌కు ఎదురులేదు: మాజీ మంత్రి



టీడీపీలో చేరిన వారితో భూమా అఖిలప్రియ

రుద్రవరం, ఫిబ్రవరి 19: ఆళ్లగడ్డలో సైకిల్‌కు ఎదురులేదని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. సోమవారం చందలూరు గ్రామంలో ఆమె పర్యటించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షసపాలనకు స్వస్తి పలికేందుకు ఎన్నికల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. ఈ ప్రభుత్వానికి చరమగీతం పాడడం ఖాయమని అన్నారు. రాజధానులు మూడు అని చెప్పి మూడు ముక్కలాట చేశారని అన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక: మండలంలోని చందలూరు గ్రామంలో మాజీమంత్రి భూమా అఖిలప్రియ సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. అంజన్‌కుమార్‌రెడ్డి, మల్లేశ్వర్‌రెడ్డి, మర్రిబోయిన నరసింహుడు, బోయరంగయ్యసుబ్బయ్య సాయి, శివ, నాగరాజుతో పాటు మరో 75 కుటుంబాలు చేరినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో భార్గవరామ్‌నాయుడు, సౌరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకత్వంపై ప్రజల్లో పెరుగుతున్న నమ్మకం

ఆళ్లగడ్డ: టీడీపీ నాయకత్వంపై ప్రజల్లో నాయకత్వంపై ప్రజల్లో నమ్మకం పెరుగుతోందని మాజీ మంత్రి అఖిలప్రియ అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలోని సామిల్ వీధిలో ఆమె సోమవారం ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ చాంద్‌బాషా, కౌన్సిలర్ హుసేన్‌బాషా, టీడీపీ మహిళా కార్యకర్తలు నూర్జహన్, రమిజా, సుబహాని, అట్ల శ్రీదేవి, పూజిత, భాస్కర్, శివ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

డోన్(రూరల్), ఫిబ్రవరి 19: డోన్ పట్టణంలో రైల్వేగేట్ల వద్ద అక్రమ కర్ణాటక మద్యం తీసుకెళ్తున్న వ్యక్తిని డోన్ సెబ్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఈ మేరకు సెబ్ సీఐ జయనాథరెడ్డి వివరాలు వెల్లడించారు. డోన్ మండలం వెంకటనాయునిపల్లె గ్రామానికి చెందిన సోమశేఖర్ బళ్లారి ప్రాంతం నుంచి కర్ణాటక మద్యం 90ఎంఎల్ 480 ఒరిజినల్ చాయిస్ మద్యం ప్యాకెట్లను తీసుకుళ్తుండగా.. వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి, నిందితుడి అరెస్టు చేసి అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ తెలిపారు. వీటి విలువ రూ.25వేలు ఉంటుందన్నారు. దాడుల్లో సెబ్ సబ్ ఇన్‌స్పెక్టర్ సోమశేఖర్‌రావు, సిబ్బంది ఉన్నారు.

తహసీల్దారుగా జ్యోతి రత్నకుమారి

సంజామల, ఫిబ్రవరి 3: సంజామల మండల తహసీల్దారుగా జ్యోతి రత్నకుమారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న మల్లికార్జున రావు చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో అనంతపురం జిల్లా నుంచి నాగభూషణంను సంజామల తహసీల్దారుగా నియమించారు. ఆయన పదవీబాధ్యతలు చేపట్టకపోవడంతో ఆయన స్థానంలో పెద్దముడియం తహసీల్దారుగా పనిచేస్తున్న జ్యోతి రత్నకుమారిని సంజామల తహసీల్దారుగా నియమించారు.

ఆళ్లగడ్డ డీఎస్పీగా షర్ఫుద్దీన్

ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 19: ఆళ్లగడ్డ డీఎస్పీగా షేక్ షర్ఫుద్దీన్ సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా పల్నాడులో ఎస్సీ ఎస్టీ విభాగంలో పని చేస్తున్న ఈయన ఇక్కడికి బదిలీ అయ్యారు. ఈయనను ఆళ్లగడ్డ పోలీస్ సబ్ డివిజన్‌లోని పోలీసు అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నంద్యాల ఎస్పీ రఘువీర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు.

యాగంటిలో పల్లకి వేడుకలు

బనగానపల్లె, ఫిబ్రవరి 19: బనగానపల్లె మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పల్లకిసేవ వేడుకలు నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ తోటబుచ్చిరెడ్డి, ఈవో చంద్రశేఖర్‌రెడ్డి, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డితో పాటు భక్తులు ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు.

వారి మృతి టీడీపీకి తీరని లోటు

ప్యాపిలి, ఫిబ్రవరి 19: మండలంలోని కలచట్ల గ్రామానికి చెందిన టీడీపీ నేతలు వెంకటేశ్వర్లు, రామచంద్రుడు మృతి చెందడం పార్టీకి తీరని లోటని ఆ పార్టీ డోన్, పత్తికొండ ఇన్‌చార్జిలు ధర్మవరం సుబ్బారెడ్డి, కేఈ శ్యాం బాబు, టీడీపీ రాష్ట్ర బీసీ సాధికార సమితి కన్వీనర్ వై నాగేశ్వరరావుయాదవ్ అన్నారు. సోమవారం పట్టణంలోని శ్రీలక్ష్మీనరసింహ ఫక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన టీడీపీ నాయకుల సంస్మరణ సభలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంకటేశ్వర్లు, రామచంద్రుడు పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. నాయకులు రామక్రిష్ణ, సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

బనగానపల్లె, ఫిబ్రవరి 19: వసుధా ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకటరామరాజు అందించిన ఆర్థిక సాయాన్ని బాధితులకు టీడీపీ నంద్యాల పార్లమెంట్ వాణిజ్య విభాగం అధ్యక్షుడు టంగుటూరు శ్రీనయ్య చేతుల మీదుగా అనారోగ్యంతో బాధపడుతున్న ముగ్గురికి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున ఆర్థిక సాయం అందించారు. సోమవారం టంగుటూరు శ్రీనయ్య కార్యాలయంలో బాధితులకు ఈ డబ్బు అందించారు. మండలంలోని జోలాపురానికి చెందిన రాజమ్మకు రూ.10వేలు, నంద్యాల పట్టణానికి చెందిన గౌస్ మొహిద్దీన్‌కు రూ.10వేలు, బనగానపల్లెకు చెందిన పటాన్‌హసన్‌ఖాన్‌ను కూ.10వేల చెక్కులను పంపిణీ చేశారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 19: మండలంలోని సౌదరదిన్నె గ్రామానికి చెందిన దూదేకుల నడిపి దస్తగిరి(43) అనే సన్నకారురైతు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నట్లు కోవెలకుంట్ల ఎస్ఐ వరప్రసాద్ సోమవారం తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా దస్తగిరి పొలాలను కౌలుకు తీసుకొని వివిధ పంటలు సాగు చేసేవాడు. అయితే పంటలు సరిగా పండకపోవడంతో రూ.రూ. 5లక్షలకు పైగా అప్పులు చేశాడు. అప్పుల బాధతో ఇంట్లోనే పురుగుల మందుతాగాడు. కుటుంబ సభ్యులు కోవెలకుంట్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రాథమిక పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం కోసం నంద్యాల ప్రభుత్వవైద్యశాలకు తరలించగా కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. భార్య దస్తగిరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పెల్లుబుకిన ఆగ్రహం

▸ జర్నలిస్టులు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో నిరసన ▸ శ్రీకృష్ణపై దాడికి పాల్పడిన వైసీపీ మూకలను అరెస్టు చేయాలని డిమాండ్

అనంతపురం జిల్లా రాప్తాడులో ఆదివారం సిద్ధం సభ కవరేజీకి వెళ్లిన ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకల దాడిని నిరసిస్తూ సోమవారం నంద్యాల జిల్లాలో ఆగ్రహం పెల్లుబుకింది. జర్నలిస్టు సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో నిరసనలు హోరెత్తాయి.



డోన్‌లో డీఎస్పీకి వినతి పత్రం ఇస్తున్న జర్నలిస్టులు, ప్రజా సంఘాల నాయకులు



చాగలమర్రిలో నల్ల బ్యాడ్జీలతో టీడీపీ నాయకుల నిరసన



బేతంచెర్లలో రాస్తారోకో నిర్వహిస్తున్న జర్నలిస్టులు, టీడీపీ, ప్రజా సంఘాల నాయకులు



ఉయ్యాలవాడలో నిరసన తెలుపుతున్న విలేకరులు, ప్రజా ప్రతినిధులు

డోన్, ఫిబ్రవరి 19: ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకల దాడిని నిరసిస్తూ డోన్ పట్టణంలో టీడీపీ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, జనసేన నాయకులు ఆలా మోహన్ రెడ్డి, బీజేపీ జిల్లా కార్యదర్శి మహారాజ్, కౌన్సిలర్ సుంకయ్య, సీపీఎం మండల కార్యదర్శి కోయలకొండ నాగరాజు, సీపీఐ మండల కార్యదర్శి పులిశేఖర్ తదితరులు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ధర్మవరం సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూ కలు దాడి చేయడం దుర్మార్గమన్నారు. బీజేపీ జిల్లా కార్యదర్శి మహారాజ్ మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడులను కట్టడి చేసేందుకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఆలా మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్‌పై దాడికి పాల్పడిన నిందితులను వెంటనే అరెస్టు చేయాన్నారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధి కార ప్రతినిధి గంధం శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి అభిరెడ్డిపల్లె గోవిందు, ఎస్ఎండీ రఫీ, జర్నలిస్టు యూనియన్ నాయకులు కరణం రమణ, నాగరాజు, ఆచారి మల్లికార్జున, జగన్, సుధాకర్ యాదవ్, శేఖర్, గోపీకృష్ణ, మురళి, కళ్యాణ్, సూర్య వెంకటేశ్, తారక్, శేఖర్ రెడ్డి, మణిధర్, బీజేపీ నాయకులు రామయ్య, రమేష్, కాంగ్రెస్ నాయకులు జనార్దన్ యాదవ్, సుబ్బు యాదవ్, శేఖర్ యాదవ్, ఎన్ఎస్‌యుఐ జిల్లా నాయకులు విజయకుమార్, బాలరాజు పాల్గొన్నారు.

● ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు దాడులు చేయడం పిరికి చర్య అని టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రజావైద్యశాల మల్లికార్జున అన్నారు. సోమవారం పట్టణంలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాప్తాడులో నిర్వహించిన సీఎం జగన్ సిద్ధం సభలో విధులు నిర్వహిస్తున్న ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై కక్ష కట్టి వైసీపీ మూకలు ఆటవికంగా దాడులకు పాల్పడటం సిగ్గు చేటన్నారు.

● ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు దాడికి పాల్పడటం అప్రజాస్వామిక చర్య అని డోన్ మాజీ కౌన్సిలర్ భారతి, సీనియర్ టీడీపీ నాయకులు సుధీష్ అన్నారు. సోమవారం పట్టణంలోని తమ నివాసంలో వారు మాట్లాడుతూ సీఎం సభలోనే జర్నలిస్టులకు రక్షణ లేకపోతే ఎలా అని ప్రశ్నించారు.

పిరికి చర్య: కాంగ్రెస్

డోన్(రూరల్): విధి నిర్వహణలో ఉన్న అనంతపురం జిల్లా ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు చేసిన దాడి పిరికి పంద చర్యగా కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయకర్త గార్లపాటి మద్దిలేటి అన్నారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అనంతపురం జిల్లా రాప్తాడులో ఏర్పాటు చేసిన సీఎం జగన్ సిద్ధం సభలో ముఖ్యమంత్రి జగన్ ప్రసంగిస్తుండగా.. జనాలు సభ నుంచి వెళ్లిపోతున్న దృశ్యాలను ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ తీస్తుండగా.. జీర్ణించుకోలేని వైసీపీ మూకలు విచక్షణారహితంగా దాడి చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు.

●అనంతపురం జి ల్లా రాప్తాడు సిద్ధం బహిరంగ సభలో వైసీపీ మూకలు ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై విచక్షణారహితంగా దాడి చేసిన వారిపై హత్యాయత్నం చేసు నమోదు చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నక్కి శ్రీకాంత్ మాట్లాడుతూ పత్రికా స్వేచ్ఛపై దాడులను వైసీపీ ప్రేరేపిస్తున్నదని ధ్వజమెత్తారు. డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి నక్కిహరి, ఎస్ఎఫ్ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దాడి అమానుషం

బనగానపల్లె: ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై దాడి చేయడం అమానుషమని బనగానపల్లె నియోజవర్గం ఏపీడబ్ల్యూజే జిల్లా కన్వీనర్ మద్దయ్య, ఆంధ్రజ్యోతి విలేఖరి వెంకటేశ్వర్లు, ఇతర జర్నలిస్టుల ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దారు కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి ధర్నా చేసి అనంతరం నిరసన వ్యక్తం చేశారు. తహసీల్దారు రవీంద్రారెడ్డికి ఫొటోగ్రాఫర్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ విలేఖరులు శ్రీనివాసులు, రమణ, వెంకట్రాముడు, రామచంద్రారెడ్డి, నరసింహారెడ్డి, రఘురామిరెడ్డి, చంద్రశేఖర్, షాషావలి, రఘురామిరెడ్డి, ఓబులేసు, మధు,నాగేశ్, శ్రీకాంత్, వేణుగోపాల్‌రెడ్డి, మనోహర్, సుధాకర్, ప్రసాద్, బాలయ్య పాల్గొన్నారు.

చాగలమర్రి: వైసీపీ అరాచక పాలనకు రోజులు దగ్గరపడ్డాయని టీడీపీ మైనార్టీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా అన్నారు. సోమవారం అనంతపురం జిల్లా రాప్తాడులోని సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్ కృష్ణపై వైసీపీ మూకలు దాడి చేయడం అమానుషమని అన్నారు. చాగలమర్రిలోని పాత బస్టాండులో టీడీపీ నాయకులు నల్లబ్యాడ్జిలతో నిరసన తెలిపారు. ట్రీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, టీడీపీ నాయకులు కొలిమి ఉసేన్‌వలి, కొలిమి షరిఫ్, మౌళాలి, అనిఫ్, ఖలీల్, ముల్లా శ్యాబుల్, ముల్లా అజీమ్, తెలుగు యువత అధ్యక్షుడు మాబులాల్, సీమాంధ్ర బీసీ సంక్షేమ అధ్యక్షుడు మహబూబ్‌బాషా, రామతీర్థం, రమేష్, జెట్టి నాగరాజు, రామసుబ్బయ్య, ఓబులేసు, అస్రఫ్, క్లస్టర్ ఇన్‌చార్జి అజీమ్, రజాక్, ఇమామ్ హుసేన్, కరిముల్లా, ఖాజా పాల్గొన్నారు. అలాగే ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్‌పై జరిగిన దాడికి నిరసనగా ఇండియన్ ఫెడరేషన్ జర్నలిస్టు యూనియన్ జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవ, ఏపీడబ్ల్యూజే వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ జిల్లా కార్యవర్గ సభ్యుడు బాలుడు, జర్నలిస్టులు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు కలిసి వీధుల గుండా బైక్ ర్యాలీ నిర్వహించి అనంతరం తహసీల్దార్ వెంకటరమణకు వినతి పత్రం అందజేశారు. మహబూబ్‌బాషా, భాస్కర్‌రెడ్డి, రవి, శివకుమార్, బాష, సాయి, నరసింహా పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: విలేకరిపై దాడి చేయడం దుర్మార్గపు చర్య అని మండల టీడీపీ కన్వీనరు కుడాల నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం రాప్తాడు సిద్ధం సభలో కవరేజీ కోసం వెళ్లిన ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ కార్యకర్తలు దాడి చేయడం దారుణమన్నారు. సోమవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆయా పత్రికా విలేకరులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దారు వెంకటరమణకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆయా పత్రికా విలేకరులు రమణ, రమష్, సతీష్, మద్దిలేటి, బాబు, ఖాసిం, టీడీపీ నాయకులు నరసింహుడు, వెంకటేశ్వర్లు, జన సైనికులు బాబు, అబ్దుల్ పాల్గొన్నారు.

శిరివెళ్ల: అనంతపురం జిల్లా రాప్తాడులో సీఎం జగన్ నిర్వహించిన సిద్ధం బహిరంగ సభలో విధి నిర్వహణలో ఉన్న ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై పాశవికంగా దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని టీడీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, గుంప్రమాన్‌దిన్నె నాయకుడు కుందూరు మోహన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ యామా గుర్రప్ప, శిరివెళ్ల మాజీ ఎంపీటీసీ కొండబోయిన బాలచంద్రుడు సోమవారం డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉన్న జర్నలిస్టులపై వైసీపీ అల్లరి మూకలు రాష్ట్ర వ్యాప్తంగా దాడులకు తెగబడుతున్నారన్నారు.

ఆళ్లగడ్డ: ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్ కృష్ణపై అమానుషంగా దాడి చేసిన అల్లరిమూకలను కఠినంగాశిక్షించాలని ఆళ్లగడ్డ తాలుకా పాత్రికేయులు సోమవారం డిమాండు చేశారు. ఈ మేరకు వారు ఆళ్లగడ్డ డిప్యూటీ తహసీల్దార్ రాజీవ్‌రెడ్డికి పాత్రికేయులు మోహన్‌రెడ్డి, శ్రీను వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నిజాం, ప్రసాద్, సుదాకరరెడ్డి, బాషా, ప్రసాదు, శ్రీనివాసులు, హనుమంతరెడ్డి, నాగరాజు, శిరివెళ్ల భాస్కర్, రుద్రవరం బాషా, శ్రీదర్ తదితరులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై దాడి అమానుషమని టీడీపీ నాయకుడు డాక్టర్ పేరా శ్రీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ అనంతపురం జిల్లా రాప్తాడులో ఈనెల 18న జరిగిన సీఎం సిద్ధం సభ కార్యక్రమానికి ఫొటోలు తీయడానికి వెళ్లిన కృష్ణపై వైసీపీ అల్లరిమూకలు దారుణంగా దాడి చేశాయని అన్నారు. ప్రజాస్వామ్యంలో పత్రికా విలేఖర్లకు స్వేచ్ఛలేకుండా చేసిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు.

● అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన సీఎం జగన్ సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై దాడి దుర్మార్గమని టీడీపీ మైనార్టీ నాయకుడు, లాయర్ అల్లీహుసేన్ పేర్కొన్నారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో విలేఖర్లతో మాట్లాడుతూ ప్రజాసమస్యలను పరిష్క రించడానికి నిత్యం శ్రమించే విలేఖర్లపై దాడులు చేయడం ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ అన్నారు.

● ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై కొందరు వైసీపీ అల్లరి మూకలు దాడికి పాల్పడడం పిరికి పంద చర్య అని బనగానపల్లె నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ గూటం బాలుయాదవ్ పేర్కొన్నారు. సోమవారం కోవెలకుంట్లలో విలేఖర్లతో మాట్లాడుతూ నిత్యం ప్రజల సమస్యలను ప్రజలకు వివరించే విలేఖర్లపై దాడులు చేయడం అమానుషమన్నారు.

ప్యాపిలి: ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్ కృష్ణపై వైసీపీ గూండాలు దాడి చేయడం హేయమైన చర్య అని టీడీపీ రాష్ట్ర బీసీ సాధికార సమితి అధ్యక్షుడు వై నాగేశ్వరరావుయాదవ్ అన్నారు. సోమవారం ప్యాపిలిలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో మీడియాకు విలువలు లేకుండా పోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామక్రిష్ణ, గండికోట రామసుబ్బయ్య పాల్గొన్నారు.

బేతంచెర్ల: అనంతపురం జిల్లా రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడిచేసిన వైసీపీ అల్లరి మూకలను శిక్షించాలని జర్నలిస్టులు, టీడీపీ, ప్రజా సంఘాల నాయకులు కోరారు. సోమవారం పట్టణంలోని పాతబస్టాండులో ఏపీయూడబ్ల్యూజే నాయకులు సీనియర్ పాత్రికేయుడు వెంకట్రాముడు ఆధ్వర్యంలో జర్నలిస్టులు, టీడీపీ, ప్రజా సంఘాల నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి, సీఎం దిష్టిబొమ్మను దహనం చేసి రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రాముడు, సుబ్బరాయుడు, వేణుగోపాల్, సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి భార్గవ్, ఈశ్వరయ్య మాట్లాడుతూ సీఎం సభలో ఫొటోలు కవరేజీ చేస్తున్న ఫొటోగ్రాఫర్ కృష్ణపై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు వెంకటేశ్వర గౌడు, నాగమధు, బండరాముడు, సుబ్బరాయుడు, నాగరాజు, దస్తగిరి, న్యాయవాది నందిపల్లి నారాయణ, టీడీపీ నాయకులు జాకీరుల్లాబేగ్, రవీంద్ర నాయక్, రామాంజనేయులు, టైలర్ రాముడు, బుక్కాపురం లక్ష్మన్న, మోహన్ గౌడు, మాదవ్ నల్లాడి, గోపాల్, సీపీఐ నాయకులు తిరుమలేష్ ఏఐఎస్ఎఫ్ ఉదయ్ పాల్గొన్నారు.






ప్యాపిలిలో మాట్లాడుతున్న వై నాగేశ్వరరావు యాదవ్, డోన్‌లో మాట్లాడుతున్న మల్లికార్జున, సీపీఎం నాయకులు, కోవెలకుంట్లలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ బాలుయాదవ్

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

బేతంచెర్ల, ఫిబ్రవరి 19: ఛత్రపతి శివాజీ 394 సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను సోమవారం సాయంత్రం పట్టణంలో ఘనం గా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూల మాలలు వేశారు. కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు నాగమోహన్, మండల అధ్యక్షుడు రాజేష్, బాలేశ్వరర్ రెడ్డి, మధుమోహన్ రెడ్డి, మురళి పాల్గొన్నారు.

బనగానపల్లె: బనగానపల్లె పట్టణంలోని పాండురంగస్వామి ఆలయంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు నాగరాజారావు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్నాథరెడ్డి, లాయర్ విశ్వనాథరెడ్డి, శరత్‌చంద్రకుమార్, మురళి, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే పేదల సంక్షేమం

చాగలమర్రి, ఫిబ్రవరి 19: టీడీపీతోనే పేదల సంక్షేమం సాధ్యమని టీడీపీ నాయకుడు నరసింహారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని శెట్టివీడు గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని అన్నారు. వైసీపీ అరాచక పాలనకు రోజులు దగ్గర పడ్డాయని అన్నారు. ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మస్తాన్, పక్రుద్దిన్, మాబు షరిఫ్, మహబూబ్‌బాషా సురేంద్ర, నన్నెసాబు, ఉసేన్‌బాష, ప్రసాదు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

రుద్రవరం, ఫిబ్రవరి 19 : పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులపై నివేదికలు ఇవ్వాలని తహసీల్దారు మురళీమోహన్ అన్నారు. సోమవారం బూత్ లెవల్ ఆఫీసర్లతో సమీక్ష నిర్వహించారు. ఓటర్ల జాబితాలో తప్పొప్పులు లేకుండా చూడాలన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి: సీఐ

శిరివెళ్ల, ఫిబ్రవరి 19 : రుద్రవరం, శిరివెళ్ల మండలాల్లోని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు సీఐ జీ చంద్రబాబు అన్నారు. శిరివెళ్ల పోలీస్ సర్కిల్ సీఐగా ఆయన సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న సీఐ వంశీధర్ నంద్యాల ఫ్యాక్షన్ జోన్‌కు బదిలీ కావడంతో రాయచోటి సీసీఎస్‌లో పని చేస్తున్న జీ చంద్రబాబు బదిలీపై శిరివెళ్లకు వచ్చారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ జీ చంద్రబాబును శిరివెళ్ల ఎస్ఐ సురేష్ మర్యాదపూర్వకంగా కలిశారు.

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

దొర్నిపాడు, ఫిబ్రవరి 19: మండలంలోని గ్రామాల్లోని ప్రజలు ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వెంకటసుబ్బారెడ్డి సూచించారు. ఆయన మాట్లాడుతూ 20 నుంచి 23వ తేదీ వరకు ఆధార్ క్యాంపులను దొర్నిపాడు, బుర్రారెడ్డిపల్లె, చాకరాజువేముల గ్రామాల్లో నిర్వహిస్తామన్నారు. 20న దొర్నిపాడు, 22న బుర్రారెడ్డిపల్లె, 23న చాకరాజువేముల గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వైసీపీది విధ్వంస పాలన: సుబ్బారెడ్డి



టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేస్తున్న సుబ్బారెడ్డి

డోన్, ఫిబ్రవరి 19: వైసీపీ విధ్వంస పాలన సాగిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న దని టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం డోన్ మండలంలోని కొచ్చెర్వు గ్రామంలో టీడీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూ రిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించి మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ నియంత పాలన సాగిస్తూ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశా రు. ఎన్నికలకు సిద్ధం అంటూ విర్రవీగుతున్న వైసీపీ ప్రభు త్వాన్ని ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నా రన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివా సులు యాదవ్, బీసీ సెల్ జిల్లా అధ్య క్షుడు ప్రజావైద్యశాల మల్లికార్జున, ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గంధం శ్రీనివాసులు, అభిరెడ్డిపల్లె గోవిందు, ఎల్ఐసీ శ్రీరాములు, మధుసూదన్ రెడ్డి, గోవిందరెడ్డి, కొచ్చెర్వు రామాంజనేయులు పాల్గొన్నారు.

● అభివృద్ధి పాలన ఎవరిదో తేల్చుకుందాం..!

ఎవరి హయాంలో అభివృద్ధి జరిగిందో బహిరంగ చర్చలో తేల్చుకుందామని టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి సవాల్ విసిరారు. సోమవారం పట్టణంలోని తన నివాసంలో సుబ్బారెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ సిద్ధం అంటూ ఫ్లెక్సీలు పెట్టి అన్ని అబద్ధాలు మాట్లాడటం సిగ్గు చేటన్నారు. టీడీపీ హయాంలో అభివృద్ధి జరిగిందో... వైసీపీ పాలనలో అభివృద్ధి జరిగిందో బహిరంగ చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. రాబోయే ఎన్నికల్లో అవినీతి పాలనకు బుద్ధి చెప్పి చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకోవడం ఖాయమని సుబ్బారెడ్డి అన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేయాలి

చాగలమర్రి, ఫిబ్రవరి 19: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఎంఈవో అనూరాధ సూచించారు. సోమవారం చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్ఎం కోటయ్య అధ్యక్షతన స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

వాసును కలిసిన మాజీ మంత్రి

ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 19: వైసీపీని వీడి చంద్రబాబు నాయుడు సమక్షంలో టీడీపీలో చేరిన గంగుల ముఖ్య అనుచరుడు, కాటన్ బోర్డు మాజీసభ్యుడు సి. శ్రీనివాసరెడ్డి (వాసు)ని మాజీ మంత్రి అఖిలప్రియ సోమవారం పట్టణంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపునకు తీసుకోవాల్సిన కార్యచరణ కార్యక్రమాన్ని వారు చర్చించుకున్నారు.

రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి

డోన్(రూరల్), ఫిబ్రవరి 19: డోన్ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని డోన్ సబ్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి తంగమణి సూచించారు. పట్టణంలోని పాతబస్టాండు ప్రధాన రోడ్డులో ఆర్టీవో క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాలు, నివారణ చర్యలు అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీనియర్ జడ్జి తంగమణితో పాటు డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్, న్యాయవాది నాగభూషణం రెడ్డి పాల్గొన్నారు. జాతీయ రహదారి భద్రత మహోత్సవాలను పురస్కరించుకుని చేపట్టిన ఈ కార్యక్రమానికి హాజరైన వాహనాల డ్రైవర్లనుద్దేశించి జడ్జి తంగమణి మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్‌ను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు.

ప్రజలందరికీ తపాలా సేవలు అందాలి

శిరివెళ్ల, ఫిబ్రవరి 19: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రజలందరికీ తపాలా సేవలు అందించడమే ధ్యేయమని ఆళ్లగడ్డ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ మౌళీశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కామినేనిపల్లె గ్రామంలో సోమవారం తపాలా ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. పోస్టాఫీసులో లభించే సేవింగ్ అకౌంట్, ఆర్‌డీ, సుకన్య సంవృద్ధి ఖాతా, గ్రామీణ తపాలా జీవిత భీమా తదితర సేవల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాస్కరరావు, పెద్దరాజు, లక్ష్మీప్రసన్న, మధులింగమూర్తి, భాస్కర్, ఖాజామోహిద్దిన్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా జనార్దన్

బేతంచెర్ల, ఫిబ్రవరి 19: మండల ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా కందగడ్డల జనార్దన్ ఎన్నిక ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం స్థానిక అమ్మవారిశాలలో బేతంచెర్ల మండల నూతన ఆర్యవైశ్య సంఘం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సభకు పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మోహన్‌రావు అధ్యక్షత వహించారు. విశిష్ట అతిథిగా వాసవి సత్రాల సముదాయ ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఆర్యవైశ్య మహాసభ మాజీ కార్యదర్శి ఇల్లూరు లక్ష్మయ్య, నంద్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధమ అధ్యక్షులు భవనాశి నాగమహేష్ సమక్షంలో నూతన మండల ఆర్యవైశ్య సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కందగడ్డల జనార్దన్, కార్యదర్శిగా మారం విష్ణుమోహన్, కోశాధికారిగా అనుముల సుధీర్ కుమార్‌తో పాటు కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షుడు కందగడ్డల రామ్మూర్తి, శేషమోహన్, బళ్లని సూర్య, అల్లంపల్లి రాజు, సముద్రాల మద్దిలేటి స్వామి, బైసాని శేషఫణి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చూడండి

ఉయ్యాల వాడ, ఫిబ్రవరి 19 : రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్యలు రాకుండా చూడాలని ఈవోపీఆర్‌డి వెంకటేశ్వర్‌రావు తెలిపారు. సోమవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ అధ్యక్షతన ఎంపీడీవో రఘురామ్ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు.